సాక్షి
రంగారెడ్డి
గురువారం । 5 । జూన్ । 2025



మున్సిపాలిటీ.. మారాలిక!

మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.. వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. 10లో▸



రెండు వాహనాలు ఢీ..

కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన దామరగిద్ద సమీపంలో చోటు చేసుకుంది. 10లో▸



డిజిటల్ మోసాలతో దడ!

నగరంలో సైబర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో మోసగాళ్లు ప్రజలను దోచుకుంటున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

మొయినాబాద్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని ఎత్‌మార్‌పల్లిలో బుధవారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆమె రైతులు, గ్రామస్తుల నుంచి 36 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ కాంచనలత తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని స్పష్టంచేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అన్ని వసతులతో కూడిన భవనం అందుబాటులో ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రీన్ ఫీల్డ్ రోడ్డుపై ప్రజాభిప్రాయ సేకరణ



రావిర్యాలలో రైతులతో సమావేశమైన అధికారులు

తుక్కుగూడ: రావిర్యాల ఎగ్జిట్– 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం అధికారులు సమావేశం నిర్వహించారు. రావిర్యాల వార్డు కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీఎల్‌వీ రాజు మాట్లాడుతూ.. మొదటి విడతలో 18.5 కిలో మీటర్ల మేర భూమి సేకరిస్తామని తెలిపారు. పరిహారం, పునరావాసం, ఉపాధి కల్పనపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని స్పష్టంచేశారు. తమకు న్యాయం చేసిన తర్వాతే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

శుభ్రత తప్పనిసరి



బేకరీలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్

ఆమనగల్లు: హోటళ్లు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు స్వచ్ఛత నియమాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శంకర్ హెచ్చరించారు. ఆమనగల్లులోని పలు బేకరీలు, దాబాలు, హోటళ్లను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుభ్రత పాటించని వారికి జరిమానాలు విధించారు. వాణిజ్య సంస్థలు విధిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

సివిల్ ర్యాంకర్‌కు సన్మానం



భరద్వాజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

షాద్‌నగర్‌రూరల్: సివిల్స్ ఫలితాల్లో 905 ర్యాంకు సాధించిన షాద్‌నగర్ పట్టణానికి చెందిన భరద్వాజ్‌ను బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఘనంగా సన్మానించారు. రాజ్‌భవన్‌లో సివిల్స్ ర్యాంకర్లతో గవర్నర్ ఇన్‌స్పైర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన వారిని ఆయన సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు.

గంజాయి పట్టివేత

షాద్‌నగర్‌రూరల్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఫరూఖ్‌నగర్‌లోని ఈద్గా వద్ద గంజాయి అమ్ముతున్న అంజద్‌ను.. పోలీసులు పట్టుకొని, కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు.. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

కబ్జా కాకుంట



గాండ్లగూడెంలో మొద్దులకుంటను పూడ్చడానికి పోసిన మట్టి

చెరువుల, కుంటల అన్యాక్రాంతంపై ఫిర్యాదులు

- భూ భారతి సదస్సుల్లో అధికారులకు వినతులు
- అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని అభ్యర్థన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రియల్టర్ల భూ దాహానికి ఖాళీ ప్రభుత్వ స్థలాలే కాదు.. చెరువులు, కుంటలు సైతం మాయమవుతున్నాయి. భగ్గున మండుతున్న ఎండలకు చెరువులు, కుంటలన్నీ ఎండిపోయాయి. కాల్వలు, కట్టలు, అలుగులు సహా శిఖం భూములు ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో ఆ పక్కనే పట్టా భూములు కొనుగోలు చేసిన రియల్టర్లు కల్వర్టులు, కాల్వలను సైతం చదును చేసి తమ వెంచర్లలో కలిపేస్తున్నారు. వరదనీరు పారకుండా అడ్డుకట్టలు వేస్తూ.. రైతుల పొలాల మీదకు మళ్లిస్తున్నారు. చెరువులు, కుంటలపై ఎప్పటికప్పుడు నిఘా పెంచాల్సిన అధికార యంత్రాంగం అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కళ్లముందే కుంటల ఆనవాళ్లను చెరిపేస్తుండటంతో కొంతమంది రైతులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

హద్దులు దాటి..

జిల్లా వ్యాప్తంగా 2,132 చెరువులు, కుంటలు 10,946 ఎంఎఫ్‌టీ సామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రభుత్వం వీటిలో ఏటా 1.20 కోట్ల చేప పిల్లలను వదులుతోంది. 400 టన్నుల కుపైగా దిగుబడి వస్తోంది. వేలాది మంది మత్స్యకారులు ఈ చెరువులు, కుంటలనే నమ్ముకుని జీవిస్తున్నారు. వేసవిలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. బఫర్‌జోన్లు, ఫుల్ ట్యాంక్ లెవల్‌లోని నీరు పూర్తిగా ఇంకిపోయింది. ఇదే అవకాశంగా భావిస్తున్న కొంతమంది అక్రమార్కులు రాత్రికి రాత్రే మట్టి నింపుతున్నారు. కల్వర్టులు, కాల్వలను ధ్వంసం చేసి నీటి ఆనవాళ్లు లేకుండా చెరిపేస్తున్నారు. ఆ తర్వాత పక్కనే ఉన్న తమ పట్టా భూముల్లో కలుపుకొంటున్నారు. భూ భారతి సదస్సుల్లో భాగంగా బుధవారం ఆయా గ్రామాలకు హాజరైన అధికారులకు ఈవిషయమై ప్రజలు ఫిర్యాదులు అందించారు.

మొద్దులకుంటలో మట్టి

యాచారం: గాండ్లగూడెం సమీపంలోని మొద్దులకుంటను ఓ వ్యాపారి మట్టితో పూడ్చేసినట్లు గుర్తించిన పలువురు రైతులు బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 313లోని పట్టా భూమి యజమానులు కొన్ని రోజులుగా మట్టితో కుంటను పూడ్చేస్తున్నారని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కనిపించకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన ఆర్డీఓ వెంటనే పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అయ్యప్ప, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వెంటనే కుంట వద్దకు చేరుకున్న అధికారులుపోసిన మట్టిని తీసేయాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెద్దకుంట కబ్జా



డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యారాజుకు వినతి పత్రం అందజేస్తున్న వంపుగూడ గ్రామస్తులు

కడ్తాల్: మండల పరిధిలోని వంపుగూడ గ్రామ సమీపంలో సర్వే నంబర్ 40లోని 'పెద్దకుంట'కు సంబంధించిన 1.12 ఎకరాల ఎఫ్‌టీఎల్ భూమిని కబ్జా చేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బుధవారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే పెద్దకుంటను సర్వే చేసి, హద్దులు నిర్ధారించాలని కోరారు.

బచ్చకుంటను కాపాడండి



పెరుగుగూడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వినతి పత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కందుకూరు: పెరుగుగూడ బచ్చకుంట కబ్జాకు గురవుతోందని, దీన్ని కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు భూభారతి సదస్సుకు హాజరైన అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 22లోని కబరస్థాన్ స్థలాన్ని కాపాడాలని కోరారు.



యాచారంలో వ్యవసాయ శాఖకు అప్పగించిన స్థలంలో కోదండరెడ్డి, రంగారెడ్డి, అధికారులు

రైతు సంక్షేమమే ధ్యేయం

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి
- రూ.కోటిన్నర విలువైన స్థలాన్ని వ్యవసాయశాఖకు అప్పగింత
- ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ

యాచారం: వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి తన ఆధీనంలో ఉన్న రూ.కోటిన్నర విలువ చేసే రెండు వేల గజాల స్థలాన్ని బుధవారం వ్యవసాయ శాఖకు అప్పగించారు. స్థానిక రైతులకు సేవలందించాలనే లక్ష్యంతో గతంలో భూస్వామి బొమ్మిడిక మల్లారెడ్డి తన 2వేల ఎకరాల స్థలాన్ని దానం చేశారు. నాటి నుంచి ఈ భూమి కోదండరెడ్డి స్వాధీనంలోనే ఉంది. అప్పటి రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రారావు నిధులతో ఇందులో భవనాన్ని నిర్మించి శ్రీవేంకటేశ్వర రైతుమిత్ర సంఘం పేరుతో కర్షకులకు సేవలందిస్తున్నారు. సదరు స్థలాన్ని ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా రైతులకు మరింత న్యాయం జరుగుతుందని కోదండరెడ్డి భావించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో స్థలాన్ని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ గోపికి అప్పగించారు. దీని చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్‌ను పిలిపించి ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. యాచారంలో మోడల్ కూరగాయల మార్కెట్ నిర్మాణం కోసం ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. శేరిగూడకు చెందిన అక్కలి మధుకర్ రెడ్డి తన రెండెకరాల భూమిని మోడల్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి విక్రయించేందుకు ముందుకువచ్చారు. దీంతో కోదండరెడ్డి, రంగారెడ్డి అధికారులతో కలిసి స్థలాన్ని సందర్శించారు.

ఫ్యూచర్‌సిటీతో మహర్దశ

ఫార్మాసిటీని రద్దు చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఇదే ప్రాంతంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోందని ఎమ్మెల్యే రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో యాచారానికి మహర్దశ పట్టనుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం యాచారం రైతు వేదికలో అన్నదాతలకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంత్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు కేవీఎస్‌రెడ్డి, మరికంటి భవాని, రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి సురేష్, తహసీల్దార్ అయ్యప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, అమృతాసాగర్, వెంకటేశ్ నాయక్ తదితరులు



లిఖిత్‌గౌడ్ (ఫైల్)



మారుతీనగర్‌లోని లిఖిత్‌గౌడ్ ఇంట్లో విషాదఛాయలు

బోట్స్‌వనాలో నగరవాసి మృతి

- రోడ్డు ప్రమాదంలో లిఖిత్‌గౌడ్ దుర్మరణం
- నేడు స్వస్థలానికి చేరుకోనున్న మృతదేహం

మీర్‌పేట: ఉపాధి కోసం విదేశానికి వెళ్లిన నగర యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన దుర్గపతి ప్రమోద్‌గౌడ్, శివరంజని దంపతులు కొన్నేళ్లుగా మీర్‌పేట మారుతీనగర్ రోడ్ నం– 2లో నివాసముంటున్నారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. కొడుకు లిఖిత్‌గౌడ్ (27) నగరంలోనే డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం 18 నెలల క్రితం సౌత్‌ఆఫ్రికా పక్కనే ఉన్న బోట్స్‌వనా దేశానికి వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కంపెనీ పని నిమిత్తం గత నెల 30న కారులో మరో చోటకు వెళ్తుండగా భారీ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ లిఖిత్ సంఘటనా స్థలిలోనే మృతిచెందాడు.

శోకసంద్రంలో తల్లిదండ్రులు..

లిఖిత్‌గౌడ్ మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు ఇకలేడనే వార్తతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. లిఖిత్‌గౌడ్ మృతదేహాన్ని నగరానికి తరలించేందుకు అక్కడి కంపెనీ యాజమాన్యం భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిందని, గురువారం మృతదేహం నగరానికి చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

భూములు లాక్కుంటే ఇక్కడే చస్తాం

- మా శవాలమీద గోశాల కట్టండి
- ఎనికేపల్లి రైతుల ఆందోళన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- మద్దతు తెలిపిన సీపీఎం, బీఆర్‌ఎస్ నేతలు



ఎనికేపల్లి భూముల వద్ద రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మొయినాబాద్: 'భూమినే నమ్ముకుని బతుకుతున్నాం.. బలవంతంగా లాక్కుంటే పెట్రోల్ పోసుకుని ఇక్కడే చస్తాం.. మా శవాల మీద గోశాల కట్టండి' అంటూ ఎనికేపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 180లోని 99.14 ఎకరాల భూమిలో గోశాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు, గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓ రైతు ట్రాక్టర్‌తో భూమిని దున్నుతుండగా అడ్డుకున్న పోలీసులు అతన్ని స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఆగ్రహానికి గురైన రైతులు నిరసన వ్యక్తంచేశారు. డెబ్బై ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను గుంజుకుంటే తామెక్కడికి వెళ్లాలని వాపోయారు.

పేదల భూములు పెద్దలకు

జిల్లాలోని పేదల భూములను లాక్కుంటున్న ప్రభుత్వం పెద్దలకు కట్టబెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగాళ్ల భాస్కర్ ఆరోపించారు. ఎనికేపల్లి భూముల వద్ద ఆందోళన చేపడుతున్న రైతులకు సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతుగా నిలిచారు. ప్రజా ఉపయోగం కోసం ప్రభుత్వం భూ సేకరణ చేయాల్సి వస్తే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించి, ప్రజలతో చర్చించాలన్నారు. కానీ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకుడు దేవమొళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. మొయినాబాద్‌లోని విలువైన భూములపై ప్రభుత్వం కన్ను పడిందన్నారు. గోశాల ఏర్పాటుకు నల్లమల అటవీ ప్రాంతంలో చాలా భూములున్నాయని.. అక్కడ గోశాల ఏర్పాటు చేయొచ్చని తెలిపారు. పచ్చని పంటలు పండే భూములపై పడొద్దని కోరారు.

రైతులతో అధికారుల చర్చలు

గోశాల కోసం సేకరించనున్న భూముల రైతులతో చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏసీపీ కిషన్ బుధవారం సాయంత్రం చర్చలు జరిపారు. డిమాండ్లను చెబితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సూచించారు. దీనిపై స్పందించిన రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని కోరగా.. అది సాధ్యం కాదని తేల్చిచెప్పారు. మీ ఆధీనంలోని 99.14 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని.. రికార్డుల్లో ఎక్కడా మీ పేర్లు లేవని తెలిపారు. అయినా న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చర్చలను సోమవారానికి వాయిదా వేశారు.

చోరీకి సోదరే సూత్రధారి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నర్సింహారావు

- పాత నేరస్తులతో కలిసి కుట్ర
- తమ్ముడి ఇంట్లో రూ.15 లక్షలు అపహరణ
- వివరాలు వెల్లడించిన సీఐ
- నగదు, కారు రికవరీ

కొత్తూరు: చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సొంత తమ్ముడి ఇంట్లో రూ.15 లక్షలు అపహరించింది బాధితుడి అక్కేనని గుర్తించారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా.. నేరం అంగీకరించి, కటకటాల పాలైంది. సీఐ నర్సింహారావు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధి స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన వన్నాడ శివశంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఇటీవల తమ పొలం విక్రయించడానికి ఇతరులతో ఒప్పందం చేసుకోగా.. కొనుగోలు చేసే వ్యక్తులు వారికి కొంత నగదును అడ్వాన్సుగా చెల్లించారు. కాగా శివశంకర్‌గౌడ్ తండ్రి, తల్లి పెద్ద కూతురుతో కలిసి విహార యాత్రకు వెళ్లే క్రమంలో ఇంట్లో ఉన్న రూ.15 లక్షల నగదును శివశంకర్‌గౌడ్‌కు ఇచ్చారు.

పాత నేరస్తులతో కుట్ర

ఈ నేపథ్యంలో గత నెల 30న షాబాద్ మండలంలో తమ బంధువుల అంత్యక్రియలకు వెళ్లే సమయంలో శివశంకర్‌గౌడ్ నగదును బీరువాలో పెట్టాడు. అప్పటికే పొలం విక్రయించిన డబ్బులు ఇంట్లో ఉన్న విషయం తెలుసుకున్న కొత్తూరు మున్సిపాలిటీ పరిధి కమ్మరిగూడలో నివాసం ఉంటున్న శివశంకర్ అక్క బోడమ్‌పల్లి స్వప్న, ఆ డబ్బును కాజేయాలని పథకం వేసింది. తనకు పరిచయం ఉన్న నేర చరిత్ర కలిగిన శంషాబాద్ మండలం షాపూర్‌కు చెందిన పానమోని అశోక్‌ను సాయం కోరగా.. అతను అదే మండలం రాళ్లగూడకు చెందిన రఘుతో కలిసి చోరీకి ప్రణాళిక సిద్ధం చేశాడు. ఒక ఆటోలో నిందితులు ముగ్గురు తిమ్మాపూర్‌లోని శివశంకర్‌గౌడ్ ఇంటికి చేరుకున్నారు. వెంట తెచ్చుకున్న రాడ్‌తో తలుపు, బీరువా తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులకు.. శివశంకర్ అక్కపై అనుమానం కలిగింది. అనంతరం ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకుంది. దీంతో వారి నుంచి నగదుతో పాటు కారు, ఆటో, స్కూటీ, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో కృషి చేసిన సీఐ నర్సింహారావు, ఎస్‌ఐలు మురళీగౌడ్, శ్రీనివాస్‌చారి, సిబ్బంది కుమార్, నరేష్, రవికుమార్‌లను శంషాబాద్ డీసీపీ అభినందించారని సీఐ తెలిపారు.



'చెరువుల అభివృద్ధి వేగంగా జరగాలి'

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చెరువుల అభివృద్ధి వేగంగా జరగాలని, మొదటి విడతగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఆరు చెరువులూ వీలైనంత త్వరలో అందుబాటులోకి రావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఈ వర్షాకాలంలోనే ఆయా చెరువులన్నీ స్వచ్ఛమైన నీటితో కళకళలాడాలని స్పష్టం చేశారు. బుధవారం తమ్మిడికుంట, సున్నం చెరువులను ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. తమ్మిడికుంటలో 26 ఎకరాల మేర నీరు నిలిచేలా, మరో నాలుగు ఎకరాల్లో పర్యావరణానికి పెద్ద పీట వేస్తూ అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు బండ్ బలంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చెరువు కింద లోతట్టు ప్రాంతంతో పాటు భవనాలు ఉన్న దృష్ట్యా బండ్‌కు వెలుపల భాగంలో కాంక్రీట్‌తో నిర్మించాలని అన్నారు. ఈ పనులకు ఎక్కడా ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సున్నం చెరువు మొత్తం 32.20 ఎకరాలు కాగా ఇప్పుడు కేవలం 14.18 ఎకరాల్లోనే నీరు నిలుస్తోందని, దీన్ని పూర్తి స్థాయికి విస్తరించాలని రంగనాథ్ సూచించారు.

రెండు వాహనాలు ఢీ..



ఘటనా స్థలంలో ధ్వంసమైన వాహనాలు

ఐదుగురికి స్వల్ప గాయాలు

చేవెళ్ల: ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి దామరగిద్ద బస్‌స్టేజి సమీపంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ చంపాపేట్‌కు చెందిన డ్రైవర్ శ్రీనివాస్.. ఎంజీ కారులో తనతో పాటు ముగ్గురు వ్యక్తులతో నగరం నుంచి వికారాబాద్‌వైపు వెళ్తున్నారు. చేవెళ్ల మండలం దామరగిద్ద సమీపంలోకి రాగానే.. వికారాబాద్ వైపు నుంచి చేవెళ్ల వైపు వస్తున్న ట్రాలీ ఆటో వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ఆటో ముందు భాగాలు దెబ్బతిన్నాయి. స్వల్పగాయాలతో ఆటో డ్రైవర్, కారులోని నలుగురు వ్యక్తులు బయటపడ్డారు. ఘటనా అనంతరం భారీగా ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు వచ్చి రోడ్డుపై నుంచి రెండు వాహనాలను పక్కకు తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయపడిన వారిని చేవెళ్లలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కారు పార్కింగ్ విషయంలో
హత్యకు పాల్పడిన నిందితుడి అరెస్టు

చైతన్యపురి: తన కారుకు అడ్డుగా పెట్టమే కాకుండా..పార్కు చేసిన కారుకు చిన్నపాటి గీత పడిందని దాడి చేసి ఓ వ్యక్తి చనిపోవటానికి కారణమైన నిందితుడిని చైతన్యపురి పోలీస్‌లు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో తెల్పిన మేరకు..న్యూ మారుతినగర్ కాలనీలోని వైష్ణవి మౌక్తిక అపార్టుమెంట్‌లో ఉండే ఖమ్మం జిల్లాకు చెందిన గండ్ర నాగిరెడ్డి ఈ నెల 21న సాయంత్రం తన కారును రోడ్డుపై పార్కు చేసి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో నాగిరెడ్డి కారు ముందు మరో కారు పార్కు చేసిన జువ్వాజి కృష్ణ తన కారు తీసేందుకు అడ్డుగా వుందని, చిన్నపాటి గీత పడిందని వాచ్‌మన్‌కు చెప్పగా అదేవిషయాన్ని వెళ్లి నాగిరెడ్డికి చెప్పాడు. కిందకు దిగి కారు వద్దకు వచ్చిన నాగిరెడ్డి, కృష్ణల మధ్య గొడవ జరిగింది. దీంతో కృష్ణ ఆవేశానికి గురై నాగిరెడ్డిపై దాడి చేశాడు. ముఖంపై కొట్టడంతో నాగిరెడ్డి చెవి నుంచి రక్తం, నోటి నుంచి నురగలు వచ్చాయి. గొడవ జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న అపార్టుమెంటులోని కొందరు కిందకు వచ్చి గాయపడ్డ నాగిరెడ్డిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసలు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అపార్టుమెంట్ అసోసియేషన్ ప్రసిడెంట్ కూడా అయిన గండ్ర నాగిరెడ్డిపై దాడి చేసిన వ్యక్తి అపార్టుమెంట్ నాలుగో ఫ్లోర్‌లో వుండే కామాక్షి అల్లుడు జువ్వాజి కృష్ణగా గుర్తించారు. గర్భిణిగా ఉన్న భార్యను చూసేందుకు అత్తగారింటికి వచ్చిన కృష్ణ పరిచయమే లేని ఓ వ్యక్తి మృతికి కారణం అయ్యాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న కృష్ణను బుధవారం నాగోలు చౌరస్తాలో అరెస్ట్ చేసి కారు.

యువకుల హల్‌చల్

షాద్‌నగర్: పట్టణంలోని బైపాస్ జాతీయ రహదారిపై దూల్‌పేట యువకులు హల్‌చల్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొంత మంది యువకులు బుధవారం మధ్యాహ్నం షాద్‌నగర్‌లోని చటాన్‌పల్లి బైపాస్ వద్దకు వచ్చారు. చేతుల్లో కట్టెలు, రాడ్లు పట్టుకుని హైవేపై పశువులను తరలిస్తున్న వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. కొందరి వాహనదారుల సెల్‌ఫోన్లు లాక్కొని, ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకే.. ఆ యువకులు ఇదంతా చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నగరంలో తప్పిన ముప్పు

- మంగళవారం రాత్రి ఆర్సీబీ అభిమానుల హడావుడి.
- చెదరగొట్టిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఐపీఎల్ గెలిచిన ఆర్సీబీ జట్టుకు కర్ణాటక ప్రభుత్వం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం సన్మానం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో కొందరు చనిపోగా, అనేక మంది క్షతగాత్రులయ్యారు. నగరంలోనూ ఇలాంటి ముప్పు తప్పింది. బుధవారం రాత్రి ఆర్సీబీ జట్టు ఐపీఎల్ కప్పు గెలిచిన వెంటనే ట్యాంక్‌బండ్, తెలుగు తల్లి చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా, సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్‌లతో పాటు అనేక ప్రాంతాలు క్రికెట్ అభిమానులతో నిండిపోయాయి. ద్విచక్ర వాహనాలపై ఫీట్లు చేస్తూ యువకులు కేరింతలు కొట్టారు. రహదారులపై పెద్ద ఎత్తున బాణాసంచ కాల్చారు. ఎన్టీఆర్ మార్గ్, సచివాలయం, తెలుగుతల్లి చౌరస్తా ప్రాంతాల్లో కొందరు రెచ్చిపోయారు. అక్కడ ఆగిన వాహనాల పైకి ఎక్కి హంగామా చేశారు. ద్విచక్ర వాహనాల హారన్లు మోగిస్తూ, మితిమీరిన వేగంతో నడిపించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసుల వెంటనే అప్రమత్తమై అక్కడకు చేరుకున్నారు. అక్కడ ఉన్న యువకుల్ని చెదరగొట్టి పరిస్థితుల్ని చక్కదిద్దారు. దాదాపు మూడు గంటల పాటు ఆ ప్రాంతాల్లో ఈ హంగామా నడవటంతో వారిని అక్కడ నుంచి పంపేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు.

మున్సిపాలిటీ.. మారాలిక!

- అభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక
- వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- పచ్చదనం పెంపునకు మొక్కల పంపిణీ
- తడి, పొడి చెత్తపై అవగాహన సదస్సులు
- సెప్టెంబర్ 10వరకు ప్రత్యేక కార్యాచరణ



తడిపొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

షాద్‌నగర్: మున్సిపాలిటీల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వంద రోజుల ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రారంభమైన కార్యక్రమం.. సెప్టెంబర్ 10 వరకు కొనసాగనుంది.

కార్యాచరణ ఇలా..

మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తోంది. పట్టణ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. మున్సిపాలిటీలోని అన్ని విభాగాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సరికొత్త ప్రణాళికతో ముందుకు సాగుతోంది. నిత్యం అధికారులు వార్డుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పచ్చదనం పెంపునకు..

వర్షాకాలం ప్రారంభం కావడంతో పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. వార్డుల్లో, ప్రధాన కూడళ్లు, పార్కులు, మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు. ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయనున్నారు.

వ్యాధులు ప్రబలకుండా..

వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో వీధులు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వందశాతం వేర్వేరుగా సేకరించడం, మురుగు కాల్వల పూడిక తీత, మురుగు కుంటలు, వరద నీటి కాల్వలను గుర్తించి శుభ్రం చేస్తున్నారు. దోమల నివారణకు మందు పిచికారీ చేసి, పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మహిళా శక్తి క్యాంటీన్లు

పట్టణాల్లో కొత్తగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వీటిని ప్రారంభించేందుకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించి, ఈ నెలాఖరు వరకు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా పట్టణాల్లో వీధి వ్యాపారులను గుర్తించి, వారికి రుణాలు ఇప్పించనున్నారు. కొత్తగా పొదుపు సంఘాలను ఏర్పాటుకు చేసి, మహిళల ఆర్థికాభివృద్ధికి తగిన ప్రోత్సాహాన్ని అందించనున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఇంజినీరింగ్ విభాగంలో అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించనున్నారు. వార్డుల్లో ఉన్న సమస్యలను అధికారులు గుర్తించి, అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. తాగునీటి సరఫరా మెరుగుపర్చడం, పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయనున్నారు. అదేవిధంగా వార్డుల్లో అక్రమ నల్లా కనెక్షన్లను గుర్తించి, వాటిని క్రమబద్ధీకరించనున్నారు. అదేవిధంగా భువన్ యాప్‌లో ఇళ్ల లెక్క పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రతి ఇంటిని యాప్‌లో నమోదు చేయనున్నారు.

స్వచ్ఛత పై అవగాహన

పట్టణంలో పారిశుద్ధ్యంతో పాటు, స్వచ్ఛత ఆరోగ్యం పై అధికారులు దృష్టి సారించారు. ఇందుకు వార్డులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటి పరిసరాల శుభ్రత, తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్యశాఖ సమన్వయంతో క్షేత్ర స్థాయిలో వ్యాధుల వ్యాప్తిపై ఆరా తీస్తున్నారు.

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యంపై వంద రోజుల ప్రణాళికలో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ప్రవేటు ఆసుపత్రుల సహకారంతో కార్మికులకు వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. మందులు పంపిణీ చేయనున్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాల్లో జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

అందరు భాగస్వామ్యం కావాలి



పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ రూపొందించింది. ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. స్వచ్ఛతకు, అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

– సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

మున్సిపాలిటీ వార్డుల జాబితా విడుదల

- జాబితాపై నేటి నుంచి 11వ తేదీవరకు అభ్యంతరాలు, సలహాల స్వీకరణ
- మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్



మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

చేవెళ్ల: కొత్త మున్సిపాలిటీగా ఏర్పడిన చేవెళ్లలో 18 వార్డుల విభజనతో ముసాయిదా జాబితాను ప్రభుత్వం విడుదల చేసిందని కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. చేవెళ్ల కొత్త మున్సిపాలిటీగా చుట్టూ ఉన్న 12 గ్రామాలు చేవెళ్ల, దామరగిద్ద, ఇబ్రహీంపల్లి, రామన్నగూడ, ఊరేళ్ల, దేవునిఎర్రవల్లి, మల్కాపూర్, పలుగుట్ట, మల్లారెడ్డిగూడ, కందవాడ, పామెన, కేసారం గ్రామాల విలీనంతో ఏర్పాటైనట్లు తెలిపారు. వార్డుల విభజనను చట్టం ప్రకారం నియమ నిబంధనలను పాటిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని జనాభా, ఓటర్లు, ఇంటి నంబర్లు, గూగల్ మ్యాప్‌ల ఆధారంగా వార్డుల విభజన చేశామన్నారు. మొత్తం మున్సిపాలిటీలో ఓటర్లు 24,872లు కాగా వీటిని 18 వార్డులకు సమానంగా ఏర్పాటు చేయటంతో నిబంధనల మేరకు ఒక వార్డులో 1,516కి మించకుండా ఉన్నారన్నారు. ఓటర్లు, గ్రామ మ్యాపులను, సరిహద్దులను పరిశీలనలోకి తీసుకొని ఈ విభజన చేశామని పేర్కొన్నారు. వార్డులకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 5 నుంచి 11వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా అందించాలని కోరారు. వార్డుల విభజనకు సంబంధించిన జాబితాలను ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డులలో పెట్టామని స్పష్టం చేశారు. ప్రజలు గమనించాలని కోరారు. దేవునిఎర్రవల్లి నుంచి 1వ వార్డుతో మొదలై ఊరేళ్ల, మల్కాపూర్, కేసారం, కందవాడ, పలుగుట్ట, మల్లారెడ్డిగూడ, పామెన, దామరగిద్ద, రామన్నగూడ, ఇబ్రహీంపల్లి, చేవెళ్ల గ్రామాల వారీగా వరుసగా ఈ 18 వార్డుల విభజన జరిగిందన్నారు.

అర్ధరాత్రి కారు బీభత్సం

బైకుపై వెళ్తున్న మహిళ దుర్మరణం

సైదాబాద్: రహదారిపై మృత్యుశకటంగా దూసుకు వచ్చిన కారు కుటుంబంతో కలిసి వెళ్తున్న మహిళను బలిగొంది. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన గురించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆస్మాన్‌ఘడ్‌కు చెందిన సీమా బేగం మంగళవారం తన భర్త అబ్దుల్ అక్బర్, కూతుళ్లు మదీహా, ఐరాలతో కలిసి డబీర్‌పురాలోని పుట్టింటికి వెళ్లి రాత్రి తిరిగి తమ ఇంటికి భర్త ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వారి వాహనం చంచల్‌గూడ చౌరస్తా దాటి ముందుకు వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంతో దూసుకు వచ్చిన కారు అప్పటికే నాలుగైదు వాహనాలను ఢీ కొడుతూ వచ్చి సీమాబేగం ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. కారు అలానే దూసుకు వెళ్లి డివైడర్‌ను ఢీ కొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన సీమా బేగం మృతి చెందింది. గాయాలైన వారిని స్థానికులు, పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల వెంటనే ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. అయితే ఈ ప్రమాదంలో సీమా బేగం భర్త, పెద్దకూతురుకు స్వల్పగాయాలు కాగా చిన్న కూతురు ఐరాకు తీవ్రగాయాలై ప్రస్తుతం చికిత్స పొందుతుంది. నిందితుడు సైదాబాద్ జయానగర్‌కు చెందిన ఎండీ అబ్దుల్ సలీం (68)గా గుర్తించారు. ఇతని నిర్లక్ష్యం డ్రైవింగ్ కారణంగానే మహిళ బలైంది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొట్టి..
20 అడుగుల మేర ఈడ్చుకెళ్లి..

సనత్‌నగర్: వెనుక నుంచి కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్ 20 అడుగుల మేర ఈడ్చుకెళ్లి అక్కడి నుంచి పరారైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మోతీనగర్ మారుతి మాన్షన్‌లో నివసించే వెంకటేశ్వరరావు ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. ఈ నెల 1వ తేదీన అర్ధరాత్రి 12.43 గంటలకు తన మనవరాలు సాన్విరాజ్ (7)తో కలిసి మూసాపేట వైపు నుంచి తన కారులో మోతీనగర్ వైపు వెళ్తుండగా భరత్‌నగర్ ఫ్లైఓవర్ సమీపంలోని నిస్సాన్ షోరూం సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ (ఎంహెచ్ 12 హెచ్‌డీ 7356) బలంగా ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా దాదాపు 20 అడుగుల మేర ఈడ్చుకెళ్లి ఆగింది. దీంతో భయపడిపోయిన డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తాత మనవమరాళ్లు క్షేమంగా బయటపడగా, కారు తీవ్రంగా దెబ్బతింది. బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

బాలుడి అదృశ్యం



శ్రీకాంత్ (ఫైల్)

కొందుర్గు: బాలుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధి శ్రీరంగాపూర్ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల అంజమ్మ, రామచంద్రయ్య దంపతుల కూతురు యాదమ్మను శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన చిటికెల నర్సింహులుకు ఇచ్చి 20 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి శ్రీశైలం, శ్రీకాంత్ ఇద్దరు కుమారులు. వీరి చిన్నతనంలోనే 13 ఏళ్ల క్రితం కుటుంబ తగాదాల కారణంగా తల్లి, తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలు గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో బాలలు ఇద్దరు స్వగ్రామంలోని నాయనమ్మ చంద్రమ్మ దగ్గరకు వచ్చారు. బుధవారం ఉదయం చిన్న మనవడు శ్రీకాంత్ ఇంటినుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. బంధువులు, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి అమ్మమ్మ అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

రోడ్లపై గెలుపు సంబరాలు..
ఇద్దరు యువకులపై కేసు

గచ్చిబౌలి: ఐపీఎల్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబీ గెలుపుతో మంగళవారం రాత్రి సంబరాలు చేసుకునేందుకు యువకులు పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుకున్నారు. కొండాపూర్ సిగ్నల్ వద్ద దాదాపు 150 మంది యువకులు బాణసంచా కాల్చుతూ వాహనాలకు దారి వ్వకుండా హల్‌చల్ చేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. హెచ్‌సీయూ డిపోకు చెందిన రూట్ నెంబర్ 10 హెచ్ బస్సు సికింద్రాబాద్ నుంచి కొండాపూర్ క్రాస్ రోడ్డుకు చేరుకుంది. అక్కడ బస్సు యూటర్న్ తీసుకోవాల్సి ఉండగా యువకులు రోడ్డుపై తిష్ట వేశారు. చాలా సేపు హారన్ కొట్టినా పక్కకు జరగకుండా బస్సును అడ్డుకున్నారు. ఇద్దరు గుర్తు తెలియని యువకులు బస్సు ఎక్కి ముందుకు కదలకుండా చేశారు. అంతే కాకుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆంటంకం కల్గించడంతో ట్రాఫిక్‌జాం నెలకొంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు తన విధులకు ఆటంకం కల్గించారని డ్రైవర్ పోచయ్య గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం..

పోక్సో చట్టం కింద నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతితో సన్నిహితంగా ఉన్న తర్వాత...మరో యువతిని వలలో వేసుకున్న ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు...బిహార్‌కు చెందిన సునీల్‌యాదవ్ గచ్చిబౌలిలోని హైహోమ్ బుజా అపార్ట్‌మెంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ యువతి బతుకుదెరువు నిమిత్తం ఏడు నెలల క్రితం హైదరాబాద్‌కు రాగా ఆమెకు సునీల్ యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సునీల్ తరచూ ఆమెను బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీలో ఉన్న తన స్నేహితుడి గదికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇటీవల సునీల్ మరో యువతితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడాన్ని గమనించిన బాధితురాలు ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించి గొడవ పడి తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. అందుకు నిందితుడు నిరాకరించడంతో తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సునీల్‌యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నవ వధువు అదృశ్యం



మౌనిక (ఫైల్)

శంషాబాద్ రూరల్: ప్రేమ వివాహం చేసుకున్న నవ వధువు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఇస్తారి చేతన్, మౌనిక గత నెల 20న ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత ఇద్దరూ ముచ్చింతల్‌లోని వినోద్ గార్డెన్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 1న స్నేహితుడి పెళ్లికి వెళ్లడానికి దంపతులు సిద్ధమవుతుండగా.. ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 3న ఉదయం చేతన్ డ్యూటీ కోసం తుక్కుగూడకు వెళ్లాడు. ఈ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి మౌనిక ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం మౌనికకు భర్త ఫోన్ చేయగా..స్విచ్ఛాఫ్ వచ్చింది. కాసేపటికి మౌనిక ఇంట్లో కనిపించడంలేదని చేతన్‌కు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. దీంతో ఆమె కోసం అన్ని చోట్ల వెతికినా జాడ తెలియకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ మోసాలతో దడ!

- ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన ఆన్‌లైన్ ఫ్రాడ్స్
- సొమ్ము కోల్పోతున్న అమాయకులు
- ఆపై పోలీసులను ఆశ్రయిస్తున్న వైనం

నగరంలో రోజురోజుకు సైబర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో మోసగాళ్లు ఈజీగా నమ్మిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. బిజినెస్ అవకాశాలు, యూపీఐ చెల్లింపులు, పొరపాటు నగదు బదిలీలతో మోసపోయిన వారంతా ఇప్పుడు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



సనత్‌నగర్: నకిలీ వెబ్‌సైట్ ఆధారంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.24 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోవడంతో కలత చెందిన ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీకి చెందిన లారెన్స్ కుమారుడు రెవరెండ్ జాన్ డి బెనోని ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.24 లక్షలు పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. దీనిపై వెంటనే గచ్చిబౌలిలోని సైబరాబాద్‌లోని సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశాడు. కానీ జాన్ డి బెనోని మానసికంగా కుంగిపోయాడు. తీవ్ర కలత చెందడంతో పాటు భయపడిపోయి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రిజిస్టర్ చేయని బ్లూ యాక్టివా-7జి వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగిరాకపోవడంతో తండ్రి లారెన్స్ పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరికి యూపీఐ పేమెంట్ చేయబోయి మరొకరికి..

తోటి కోడలుకు నగదు బదిలీ చేయాలని భావించిన మహిళ పొరపాటు మరో వ్యక్తికి రూ.51,400 పంపించగా..అతను తిరిగి ఆ మొత్తాన్ని తిరిగి పంపించడానికి నిరాకరిస్తుండడంతో బాధితురాలు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఫతేనగర్‌లో నివాసం ఉండే లక్ష్మణ్ గాయత్రి గత నెల 22న తన తోటి కోడలుకు రూ.51,400 బదిలీ చేయాలని భావించింది. ఈ క్రమంలో పొరపాటున మరో వ్యక్తి నెంబర్‌కు పంపించింది. దీంతో లక్ష్మణ్ గాయత్రి ఆ నెంబర్‌లోని వ్యక్తిని సంప్రదించగా ఆ నగదును తిరిగి పంపించేందుకు నిరాకరిస్తూ వస్తున్నాడు. ఎంతగా బతిమాలినా పంపించకపోవడంతో బాధితురాలు బుధవారం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగదు అవసరమంటూ స్నేహితుడి పేరిట సందేశం..

డబ్బు అవసరం ఉందని తన స్నేహితుడి పేరిట వచ్చిన వాట్సప్ సందేశానికి స్పందించిన ఓ వ్యక్తి రూ.50 వేలు పోగొట్టుకున్నాడు. సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సనత్‌నగర్ జెక్‌కాలనీ రోడ్డునెంబర్-1లోని వాసవీ డ్రీమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే శామ్యూల్ బర్నబాస్‌కు గత నెల 26న తన స్నేహితుడికి అత్యవసరంగా డబ్బు అవసరమంటూ వాట్సప్‌లో సందేశం వచ్చింది. వెంటనే తన స్నేహితుడిగా భావించి రూ.50 వేలు పంపించాడు. అనంతరం స్నేహితుడిని ఫోన్‌లో సంప్రదించగా, డబ్బు కావాలంటూ తాను ఎలాంటి సందేశం పంపలేదని చెప్పడంతో శామ్యూల్ అవాక్కయ్యాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెలికాప్టర్ సేవల పేరుతో టోకరా

ఇన్‌స్టాగాం బిజినెస్ పేజీ వేదికగా 'హెలీ' సేవలకు సంబంధించిన ప్రకటనను చూసి ఓ వ్యక్తి రూ.34,616 కోల్పోయిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సనత్‌నగర్‌కు చెందిన నరేష్ గత నెల 27న ఇన్‌స్టాగాం వ్యాపార పేజీని చూస్తున్న సమయంలో పాట్నా నుంచి కేదార్‌నాథ్‌కు హెలీ సేవలు అందిస్తున్నట్లుగా ఓ ప్రకటన వచ్చింది. ఆ ప్రకటనను చూసిన నరేష్ అందులో ఇచ్చిన నెంబర్ ఆధారంగా సంప్రదించాడు. అయితే ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అందుకు రూ.34,616 పంపించాల్సిందిగా అవతలి వ్యక్తి చెప్పాడు. దీనిని నిజమని భావించిన నరేష్ ఆ మొత్తాన్ని యూపీఐ ద్వారా పంపించాడు. నగదును పంపించినప్పటికీ మళ్లీ చెల్లించాలని కోరారు. దీనిపై అనుమానం కలగడంతో బాధితుడు బుధవారం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.